క్లుప్తంగా

నేడు మంత్రిపెద్దిరెడ్డి పర్యటన

● 39 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ, విద్యుత్, గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం మండలంలో 39 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు.రెండు బస్ షెల్టర్లు, ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు, రెండు పాలశీతలీకరణ కేంద్రాలు, 8 హెల్త్‌సెంటర్లు, 7రైతు భరోసా కేంద్రాలు, షాదీమహళ్లు 2, 6సచివాలయాలు ,రెండు ఆర్వో ప్లాంట్లు, డిజిటల్ లైబ్రరీ, కమ్యూనిటీ హాలు..ఇత్యాది వాటికి ప్రారంభోత్సవాలు చేస్తారని, అలాగే సాంఘిక సంక్షేమ పాఠశాలకు భూమి పూజ చేస్తారని వివరించారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

బైరెడ్డిపల్లి: శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సంయుక్తంగా ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు చేసి 45 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళి, శ్రీనివాసులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యానికి భద్రత



ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు: ఆర్టీసి కార్మికులు ఆరోగ్యవంతులుగా ఉండేందుకు వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుధాకరయ్య అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, ప్రభుత్వాసుపత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ డిపోలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కరీముల్లా, గౌరిశంకర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయరూ!



సమావేశంలో యూటీఎఫ్ నాయకులు

పలమనేరు: పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని యూటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి రమణ మాట్లాడారు. పలువురు యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అబ్దుల్ సుభాన్‌కు బెస్ట్ వర్కర్ అవార్డ్



అవార్డు అందుకుంటున్న సుభాన్

పలమనేరు: పట్టణానికి చెందిన మానవ హక్కుల సంఘ సేవకుడు అబ్దుల్ సుభాన్‌కు బెస్ట్ వర్కర్ అవార్డ్ వరించింది. అన్నమయ్య జిల్లాలోని రైల్వే కోడూరులో ఆదివారం జరిగిన మానవహక్కుల మండలి సమావేశంలో ఆ సంఘ జాతీయ అధ్యక్షులు అన్సారీ నుంచి అవార్డును ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు అన్సరుల్ హక్, పాయల్, చింతా శారద, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పలమనేరు: పట్టణ సమీపంలోని రెంటకుంట్ల రోడ్డులోని శ్రీ రమాదేవీ సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారి కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారిని కొలువుదీర్చి, కంకణ ధారణ, మంగళపూజ సమర్పణ భక్తజన సందోహం నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్వాహకులు నాగరాజు, మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు వెంకటేష్, భక్తులు పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ



ఎంబిటి రోడ్డును విస్తరించి వేసిన తారు రోడ్డు



పట్టణ సమీపంలోని సుబ్బమ్మ చెరువు కట్టపై కొత్తగా వేస్తున్న రోడ్డు

- మారిన రోడ్లు, చెరువు కట్టల రూపురేఖలు
- మెరుగు పడిన రవాణా సౌకర్యాలు
- మంత్రి పెద్దిరెడ్డి కృషి ఫలితం

పుంగనూరు: జమీందారుల కాలంలో నిర్మించిన చెరువు కట్టలు, అప్పుడు వేసిన రోడ్లు దెబ్బతిన్నా గత ప్రభుత్వాలు వాటిపై దృష్టి సారించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. సుమారు 50 ఏళ్ల క్రితం వేసిన ఎంబిటి రోడ్డు అధ్వాన స్థితికి చేరినా 30 ఏళ్లు ఒకే కుటుంబం ఇక్కడ పెత్తనం సాగించినా వీటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దీనిపై మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి దృష్టి సారించారు. మూడు నెలల కాలంలో జాతీయ రహదారి రూపురేఖలు మార్చివేశారు. ప్రతి గ్రామానికి రోడ్లు వేయించారు. దీంతో మట్టిరోడ్లు, అధ్వానంగా ఉన్న బీటీ రోడ్ల రూపురేఖలు మారిపోయాయి. ఫలితంగా రవాణా సౌకర్యాలు ఎంతగానో మెరుగుపడ్డాయి. అలాగే ప్రధాన చెరువు కట్టల బలోపేతానికి చర్యలు తీసుకున్నారు.

రోడ్లకు ప్రత్యేక నిధులు

పట్టణంలోని ఎంబిటి రోడ్డును సుమారు 60 అడుగుల వెడల్పుతో విస్తరణ కార్యక్రమం దాదాపు పూర్తి కావచ్చింది. ఇందుకు గాను రూ.52 కోట్లు విడుదల చేశారు. చిత్తూరు రోడ్డులోని అరబిక్ కళాశాల బైపాస్ రోడ్డు నుంచి గూడూరుపల్లె, పుంగనూరు మీదుగా రాంపల్లె, భీమగానిపల్లె బైపాస్ రోడ్డు వరకు కొత్త రోడ్డు ఏర్పాటు పనులు వేగవంతంగా చేపట్టారు. అలాగే సుబ్బమ్మ చెరువు కట్టను సుందరంగా తీర్చిదిద్దారు. వాహనాలు ప్రయాణించేందుకు అనుకూలంగా చేసి, ట్రాఫిక్‌ను తగ్గించేలా కొత్త రోడ్డు వేశారు. ఇక, పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి పుంగమ్మ చెరువు కట్ట వరకు 60 అడుగుల సిమెంటు రోడ్డును వేశారు. డివైడర్లు, రంగు రంగుల ఎల్ఈడీ దీపాలు వేయడంతో పట్టణానికి నూతన శోభ చేకూరింది. వీటితో పాటు ఐదు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని శంకరాయలపేట రోడ్డు పుంగమ్మ చెరువు కట్ట మీదుగా వెళ్లాల్సి ఉంది. 25 అడుగుల రోడ్డులో ప్రమాదాలు సంభవించి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ రహదారిని సుమారు 50 అడుగుల వెడల్పుతో విస్తరించి సుమారు రూ.120 కోట్లతో జాతీయ రహదారికి అనుసంధానం చేసే పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి.

రూపురేఖలు మారుతున్నాయ్



“పట్టణంలోని ఎంబిటి రోడ్డును విస్తరించడంతో పట్టణం రూపురేఖలు మారిపోతున్నాయి. నెల రోజుల్లో ఎంబిటి రోడ్డులో డివైడర్లు వేసి, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నాం. పుంగనూరు సుందరమైన పట్టణంగా మార్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఎస్.అలీమ్‌బాషా, మున్సిపల్ చైర్మన్

జగను ప్రభుత్వం బాగా చేస్తాంది



సరైన రోడ్లు లేక చాలా ఏళ్ల కష్టాలు పడ్డాం. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయినాక ఈ బాధలన్నీ పోయినాయి. మున్సిపాలిటీ కూడా ఎంతో అభివృద్ధి చెందింది. టౌనులో ట్రాఫిక్ వలన నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు రోడ్లు బాగా వెడల్పు చేసినారు. ఇప్పుడే ఇబ్బందులూ లేవు నాయనా! జగను ప్రభుత్వం బాగా చేస్తాంది. – ఎస్.సుశీలమ్మ, గృహిణి, పుంగనూరు

గాండ్ల కులస్తుల కల సాకారం



గాండ్ల కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

- కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయింపు
- చంద్రబాబు పాలనలోనూ మొండిచెయ్యే!
- వైఎస్సార్ సీపీ పాలనలో ఆవిష్కృతం

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో సామాజిక వర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగా గాండ్ల కులస్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. మున్సిపాలిటీకి సమీపంలోని గుడుపల్లె మండలం గుండ్లసాగరం గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 88లోని 3.45 ఎకరాల విస్తీర్ణంలో 2.08 ఎకరాలను గాండ్ల కులస్తుల కమ్యూనిటీ హాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత నెల కుప్పం పర్యటనలో గాండ్ల కులస్తుల వినతిపై స్పందించి ఈ స్థలం మంజూరు చేయించారు.

గాండ్ల సామాజిక వర్గం హర్షం

నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంలో గాండ్ల కులస్తులకు స్థలం కేటాయింపుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గాండ్ల కులస్తులు పెద్ద హోదాల్లో, పదవులు అనుభవించినా కులస్తులకు చేసింది శూన్యం. ఇప్పటి వరకు ఇదే సామాజిక వర్గానికి చెందిన నలుగురు కుప్పం ఎమ్మెల్యేలుగా పనిచేశారు. అనంతరం చంద్రబాబు సీఎంగా అధికారంలో ఎమ్మెల్సీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, టీడీపీ పార్టీ అధ్యక్షులుగా గాండ్ల కులస్తులు ఉన్నారు. 35 ఏళ్లుగా చంద్రబాబుకు వ్యక్తిగత క్యాదర్శిగా పనిచేస్తున్న వ్యక్తి కూడా గాండ్ల కులస్తుడే. కానీ ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలనే గాండ్ల కులస్తుల కలను ఎవరూ సాకారం చేయలేకపోయారు.

వైఎస్సార్ సీపీ పాలనలో నెరవేరింది

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో గాండ్ల కులస్తుల కల సాకారమైంది. గాండ్ల కులస్తుల వినతి మేరకు స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేకంగా ప్రభుత్వ ఉత్తర్వులు తీసుకొచ్చారు. త్వరలో స్థలాన్ని చదును చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల రణభేరికి ‘సిద్ధం’



మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెప్ప

పెద్దపంజాణి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల రణభేరికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలని ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కోగిలేరు, నాగిరెడ్డిపల్లె పంచాయతీలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, రాబోయే రెండు నెలలు కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని, జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే ప్రచారాస్త్రాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గత పాలకుల మాదిరిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అటకెక్కించకుండా 100 శాతం అమలు చేసిన ఘనత కూడా తమ ప్రభుత్వానిదేనన్నారు. వీటన్నింటినీ ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచ్ రమేష్ బాబు, ఎంపీటీసీ పరంధామ, నాయకులు కుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివశంకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సుబ్రమణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం



మహిళలకు సారె అందజేస్తున్న దుర్గ

● ఇంటింటా ఎన్నికల ప్రచారంలో దుర్గ

రామకుప్పం: కుప్పం నియోజక వర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లె, విజలాపురం, రామకుప్పం పంచాయతీలలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు చేకూరిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పార్టీలు, కులమతాలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుప్పం నియోజకవర్గం అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అభివృద్ధి పనులను ఆమె వివరించారు. అలాగే మహిళలకు మహిళలకు సారె అందజేసి, రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని, కుప్పంలో పార్టీ జెండా విజయకేతనం ఎగురవేసేలా చూడాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబు రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, స్థానిక సర్పంచులు మురళీకృష్ణ, రాజ్ గోపాల్, కుప్పం ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, టౌన్ అధ్యక్షుడు అప్పి, మాజీ ఎంపీపీ వెంకటమ్మ, వార్డు సభ్యులు అబ్దుల్,గోపీకృష్ణ, జమీను ప్రసాద్, యువజన విభాగం మండల అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, నేతలు తజ్‌ముల్ పాషా, సిద్ధప్ప, నయాజ్, నారాయణ స్వామి, శంకర్, వెంకటాచలపతి పాల్గొన్నారు.

సింగిల్‌విండోలో ఈకేవైసీ చేసుకోండి

రామకుప్పం: స్థానిక సింగిల్‌విండో సొసైటీలో రుణాలు తీసుకున్నవారు, డిపాజిట్‌దారులతో సహా సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని బ్యాంకు అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, సీఈఓ సుబ్రమణ్యం ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్, పాన్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, వన్-బీ అడంగల్ నకళ్లను స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో సమర్పించాలన్నారు. సోమవారం లోపు సభ్యులందరూ అవసరమైన పత్రాలను అందజేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

గుడుపల్లె: ద్విచక్రవాహనాలు, ఆటోలు, టెంపోలు, ఇతరత్రా వాహనాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని ఎస్ఐ లక్ష్మీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక గుడుపల్లె-కుప్పం రోడ్డులో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులతో వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఉబ్బ దేవర్లు



వీరభద్రస్వామికి మొక్కుతున్న రజక వృత్తిదారులు

పెద్దపంజాణి: రజక కులస్తులు ప్రతి ఏటా నిర్వహించే ఉబ్బ దేవర్లను ఆదివారం రాయలపేటలో ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో పాపన్న, హేమచంద్ర, చంగప్ప, పెద్దరెడ్డెప్ప, చిన్నరెడ్డెప్ప, శీనా, మునిరాజ, చెంగల్వ, నాగరాజ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకులకు సన్మానం



పలమనేరు: పలమనేరుకు చెందిన శ్రీవారి సేవకులను కాణిపాకం ఆలయ అధికారులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలానికి చెందిన కాప్పల్లి రవీంద్రారెడ్డి, స్థానిక రైతులు, మండీ యజమానులే కాకుండా కర్ణాటకకు చెందిన రైతుల నుంచి సైతం కూరగాయలను సేకరించి తిరుమలలోని వెంగమాంబ నిత్యాన్నదాన సత్రానికి పంపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాణిపాకం ఆలయంలో నిత్యాన్నదానానికి సైతం వీరు కొంతకాలంగా కూరగాయలను అందజేస్తున్నారు. దీనిపై స్పందించిన కాణిపాకం ఆలయ కమిటీ అక్కడి ఆలయంలో వారిని సముచిత రీతిలో సత్కరించింది.

4వ విడత వైఎస్సార్ ఆసరా రేపు



మహిళా సమాఖ్య సిబ్బందితో సమావేశమైన నాయకులు

గంగవరం: మండలంలోని పొదుపు సంఘాల మహిళలకు 4వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని మైదానంలో ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో వెలుగు మహిళా సమాఖ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ చేస్తారని, మండలంలోని మహిళా సమాఖ్య సభ్యులు, వెలుగు సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లద, వెలుగు ఏపీ హరినాథ్, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు



విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ తరగతులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో డివిజన్ పరిధిలోని హాస్టళ్ల టెన్త్ విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఆదివారం నిర్వహించారు. గంగవరం ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సోమచంద్రారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే కష్టసాధ్యమైనదీ ఏదీ లేదన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలన్నారు. కార్యక్రమంలో పలువురు హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

పోలీసుల ‘పల్లెనిద్ర’

● ఎన్నికలల్లో గొడవలకు పాల్పడితే కేసులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

రొంపిచెర్ల: ఎన్నికలలో గొడవలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని కల్లూరు సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం రాత్రి మండలంలోని శ్రీనాథపురం కాలనీలో పోలీసుల పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో సీఐ మాట్లాడారు. గొడవలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. వీటికి పాల్పడితే కేసులతో నష్టపోతారనేది గుర్తెరగాలన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు ఓటు వేసేలా బందోబస్తు కల్పిస్తామన్నారు. మండలంలో ఇప్పటి వరకు 71 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. రౌడీ షీటర్లు ఎన్నికలలో గొడవలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం శ్రీనాథపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య, పోలీసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

15న సేవాలాల్ మహారాజ్ జయంతి

పుంగనూరు: సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు బంజార సంఘ ప్రతినిధి డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ తెలిపారు. ఆదివారం సంఘ నాయకులు నాగేనాయక్, ఆంజినాయక్, శ్రీనివాసులుతో కలసి జయంతి వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఏడు తాండాలలోని బంజారాలతో కలసి ఈ జయంతి వేడుకలు పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో నిర్వహిస్తామన్నారు. అందరూ పాల్గొని ఐకమత్యాన్ని చాటాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు, సభ్యులు

పలమనేరు: పట్టణానికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ 2024 సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆదివారం అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకుడు గురు రాజారావు మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగులకు ఎంతో ఉపయుక్తమైన సమాచారం ఈ డైరీల్లో ఉందన్నారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని గుండ్లూరువారిపల్లెలో అంబేడ్కర్ అంతర్జాతీయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, డాక్టరు రవి, కృష్ణయ్య, సుదర్శనం, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మైసూర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

బైరెడ్డిపల్లి: బాటగంగమ్మ జాతర సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మైసూర్ టీమ్ విన్నర్స్‌గా నిలిచింది. ఈ జట్టు ఫైనల్స్‌లో మైలేరు దొర్లై జట్టుపై విజయం సాధించింది. విన్నర్స్‌కు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు, మూడవ స్థానంలో నిలిచిన చిక్లగట్ట జట్టుకు రూ.20వేలు, 4వ స్థానంలో నిలిచిన వి.కోట జట్టుకు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వాలీబాల్ టోర్నీతో సందడి సందడిగా మారింది.

కోలాహలం.. నిమజ్జనం



భోజనం వడ్డిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె బాటగంగమ్మ జాతరను శనివారం రాత్రి వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారి శిరస్సును ప్రతిష్టించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి శిరస్సును నిమజ్జనానికి తరలించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ నివాసం వద్ద అన్నదానం చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, పెద్దిరెడ్డి అభినవ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.